ఆకాశవాణి హైదరబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.05.2026 సమయం : 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

2. రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

3. రాష్ట్ర వ్యాప్తంగా మే డే వేడుకలను ఘనంగా జరుపుకుంటూ, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు కార్మికుల త్యాగాలను స్మరించుకుంటున్నాయి.

4. రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

**భట్టి విక్రమార్క - మిర్యాలగూడ...**

రాష్ట్ర ప్రభుత్వం అణగారిన వర్గాలు, కార్మికుల హక్కులను కాపాడుతూ పాలన కొనసాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మిర్యాలగూడ పర్యటనలో భాగంగా మే డే కార్యక్రమంలో పాల్గొని పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఉప ముఖ్యమంత్రి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్మిక లోకానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వివరించారు.

( డెస్క్)

**సీపీ ఆనంద్**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీపీ ఆనంద్ ఈరోజు ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారని, డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసు బృందం బాగా కృషి చేస్తోందన్నారు. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

(పిటీసీ, హైదరాబాద్)

**మే డే వేడుకలు**

రాష్ట్ర వ్యాప్తంగా మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు జెండా ఆవిష్కరణలు, ర్యాలీలతో కార్మికుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన మే డే వేడుకల్లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మిర్యాలగూడలో జరిగిన మే డే వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక వాడల్లో మే డే వేడుకలను కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నాయి. సింగరేణి, ఆర్టీసీ కార్మికులు తమ పని ప్రదేశాల్లో సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్ లో కూడా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు మే డే వేడుకలను జరుపుకున్నాయి. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలను అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు.

( డెస్క్)

**వాకిటి శ్రీహరి**

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మహబూబ్‌నగర్ లో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం విద్యార్హతలు మాత్రమే సరిపోవని, నైపుణ్యాలు, టెక్నాలజీపై అవగాహన ఉంటేనే మంచి ఉద్యోగాలు పొందగలరన్నారు.

బైట్ ... వాకిటి శ్రీహరి

(పిటీసీ, మహబూబ్ నగర్)

**సిఎంకు బండి సంజయ్ లేఖ...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వడ్ల కొనుగోళ్లలో తాలు, తరుగు పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలన్నారు. క్వింటాల్ వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్న హామీని అమలు చేయాలని, తరుగు, తేమ పేరుతో రైతులను ముంచవద్దని కోరారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

( డెస్క్ )

**పెద్దపల్లి - శ్రీధర్ బాబు...**

గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. మంథనిలో నిర్వహిస్తున్న సూపర్ సమ్మర్ వేసవి శిబిరాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... టి-ఫైబర్ సంస్థ, సూపర్ టీచర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాలలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు.

(పిటీసీ, పెద్దపల్లి)

**ఉత్తమ్ కుమార్ రెడ్డి - వంట గ్యాస్ ధరలు**

కేంద్ర ప్రభుత్వం పెంచిన వాణిజ్య వంట గ్యాస్ ధరను ఉప సంహరించుకోవాలని పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ నిర్ణయం సామాన్యుడిపై పెనుభారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం వరకు ధర పెంచడంతో హోటళ్లు, కేఫ్‌లు, రెస్టారెంట్లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

పిటిసి, హైదరాబాద్

**టిమ్స్ ట్రయల్ రన్...**

రాష్ట్ర ప్రభుత్వం సనత్‌నగర్ లో నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రిలో ఈరోజు ఉదయం ట్రయల్ రన్ ప్రారంభమైంది. రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఈ హాస్పిటల్‌లో అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించారు. టిమ్స్ ఆసుపత్రి ట్రయల్ రన్ సుమారు నెల రోజుల పాటు కొనసాగనుందని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ నెల రోజుల వ్యవధిలో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 22 కీలక విభాగాలకు సంబంధించిన వైద్య సేవలు అందుబాటులో ఉండనున్నాయని తెలియచేసింది.

(పిటీసీ హైదరాబాద్)

**ఓఆర్ఆర్‌పై ప్రమాదం**

శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై ప్రమాదం జరిగింది. ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్-16 వద్ద ఆగివున్న లారీని ఓ కారు వెనక నుంచి ఢీ కొన్నది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారికి

మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

(డెస్క్)

**ధాన్యం కొనుగోళ్లు**

ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల మండలం, సాండ్గాం గ్రామంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

బైట్.. కలెక్టర్ హరిత

(పిటీసీ. ఆసిఫాబాద్)

**వాతావరణం**

రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలియచేసింది. రానున్న మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగవచ్చని, పలు జిల్లాల్లో 40 నుండి 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

(డెస్క్)